క్లుప్తంగా

మాజీ సీఎం జగన్ దృష్టికి మైనార్టీల సమస్యలు



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలసిన జాన్ వెస్లీ

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో క్రిస్టియన్ మైనార్టీలు పడుతున్న ఇబ్బందులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్ వెస్లీ తెలిపారు. తాడేపల్లిలో బుధవారం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్టియన్ల సమస్యలను వివరించినట్లు చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

దాడిశెట్టి రాజాకు సత్కారం



పెదశంకర్లపూడిలో దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మండలంలోని పెదశంకర్లపూడిలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దోశే చిట్టిబాబు స్వగృహం వద్ద పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, బదిరెడ్డి గోవిందు తదితరులు దాడిశెట్టి రాజాను శాలువా, పూలమాలతో సత్కరించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను (బంకు శ్రీను), ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పార్టీ గోళ్ల జయశేఖర్, దోశే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రికార్డులు సక్రమంగా లేని టిప్పర్ లారీని సీజ్ చేసిన కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్

రౌతులపూడి: స్థానిక రౌతులపూడి–తేటగుంట రహదారిలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. భద్రతా నియమాలు పాటించని వాహనాలపై 14 కేసులు నమోదు చేసి రూ.85 వేలు జరిమానా విధించినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎలాంటి రికార్డులు లేకుండా అధిక లోడుతో వెళుతున్న లారీని సీజ్ చేశామన్నారు. పరిమితికి మించి రవాణా సాగించే వాహనాలు, వేగంగా నడిపే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు, వాహన చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కత్తిపూడి రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



శంఖవరం కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న దేవానందరెడ్డి

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సమగ్ర శిక్ష కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి సూచించారు. స్థానిక కేజీబీవీని బుధవారం ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి నాలెడ్జ్ పెంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలామణికుమారి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉల్లాస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

రౌతులపూడి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు గాను ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉపాధ్యాయులకు గురువారం ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు వెలుగు ఏపీఎం త్రినాథమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ శిక్షణకు హాజరుకావాలని ఆమె కోరారు.

అరటి సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న మెట్ట రైతులు
- నియోజకవర్గంలో 2,312 ఎకరాల్లో సాగు
- తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి



ప్రత్తిపాడు మండలం ఇగోకవరంలో చేపట్టిన అరటి సాగు



అరటి సాగులో అంతర పంటగా వేసిన ఆయిల్ పామ్ మొక్కలు

ప్రత్తిపాడు: మెట్ట రైతులు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సీజన్‌ను బట్టి మంచి ధరతో పాటు దిగుబడి వస్తుండడంతో ఏటా మెట్టలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,312 ఎకరాల్లో రైతులు అరటి సాగు చేస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించడమే కాకుండా తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ సూచించారు.

నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం మండలంలో అత్యధికంగా 988 ఎకరాలు, రౌతులపూడి మండలంలో అతి తక్కువగా 138 ఎకరాల్లో అరటి సాగు జరుగుతోంది. ప్రత్తిపాడు మండలంలో 813 ఎకరాలు, శంఖవరం మండలంలో 373 ఎకరాలు వెరసి 2,312 ఎకరాలలో ఈ ఏడాది రైతులు అరటి సాగు చేపట్టారు. సాగు లాభదాయకంగా ఉండటంతో వరి పండించే రైతులు సైతం అరటి వైపు దృష్టి సారించారు.

అంతర పంటలకు అనుకూలం

అరటితోట అంతర పంటలకు అనుకూలం. అరటి సాగులో అంతర పంటలుగా ఆకుకూరలు, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర కూరగాయలు సాగు చేసి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. అంతర పంటలకు అరటితో సంబంధం లేకుండా ఎరువులు అదనంగా ఇవ్వాలి. అరటి సాగుకు ఎక్కువగా నీరు అవసరం, అయితే తోటలో నీరు నిల్వ ఉండకూడదు. ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు వేస్తే అరటి చెట్లు అధిక దిగుబడులు ఇస్తాయి. అరటిలో తల్లి చెట్టుకు సరైన పోషకాలు అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యం. అరటి పిలకలు చిన్నవిగా ఉన్నప్పుడే తల్లి చెట్టు నుంచి తొలగించాలి. అరటి చెట్టు రకాన్ని బట్టి 10 అడుగుల కన్నా ఎత్తుగా ఉన్నప్పుడు, గెల వేసిన తర్వాత బరువుకు చెట్టు పడిపోకుండా కర్రల ద్వారా ఊతం ఇవ్వాలి. గెల వేసిన తర్వాత గెల చివరన ఉండే మగపువ్వుని తుంచివేయాలి. అరటి గెలలకు కవర్లు (బంచ్ కవర్లు) తొడిగితే గెల పరిమాణం, దిగుబడి, నాణ్యత బాగుంటాయి.

అరటికి సోకే తెగుళ్లు, నివారణ

దుంప కుళ్లు తెగులు

పెద్ద పచ్చ అరటి, తెల్ల చక్రకేళీ రకాలకు దుంప కుళ్లు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. కాండం–దుంప మధ్య కుళ్లు మచ్చలు ఏర్పడి, క్రమేపి దుంప కుళ్లిపోతుంది. పెద్ద మొక్క కాండంపై నిలువుగా పగుళ్ల ఏర్పడతాయి. దుంప పైభాగం కుళ్లిన వాసన వస్తుంది. కింద వరస ఆకులు పసుపు రంగులోకి మారి, ఎండిపోయి మొక్క చనిపోతుంది. దీని నివారణకు తెగులు సోకిన మొక్కలను దుంపతో సహా తీసివేసి తగలబెట్టాలి. మొక్కలు తీసివేసిన చోట చుట్టుపక్కల ఆరోగ్యవంతమైన మొక్కల మొదళ్ల వద్ద బాగా తడిసేలా సుడోమోనాస్ 50 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగులు ఉధృతి ఎక్కువైతే పంట మార్పిడి చేయాలి.

వర్తులాకార తెల్లదోమ

చెట్ల ఆకుల అడుగు భాగాన వలయాకారంలో గుడ్లను ఏర్పరుస్తుంది. ఆకుల నుంచి రసం పీల్చుతుంది. పురుగు ఆశించినప్పుడు స్రవించిన తేనేలాంటి జిగురు పదార్థం వలన ఆకుల పైభాగంలో మసిమంగు ఏర్పడుతుంది. ఆకుల్లో జరిగే కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడి దిగుబడి తగ్గిపోతుంది. దీని నివారణకు అజాడిరక్టిన్ పీపీఎం మందును నీటరు నీటికి 3 ఎంఎల్ మందును కలిపి, నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు ఆకుల కింది భాగం తడిసేలా పిచికారీ చేయాలి.

దుంప పుచ్చు పురుగు

దుంపలో వలయాకారపు బొరియలు చేసి దుంప కుళ్లిపోయేలా చేస్తుంది. క్రమేపీ చెట్టు ఎండిపోతుంది. దీని నివారణకు ఒక్కొ మొక్కకు 25 గ్రాముల కార్బోఫ్యూరాస్ గుళికలను చెట్టు మొదళ్లలో వేసి, మట్టితో కప్పి నీరు పెట్టాలి.

నులి పురుగులు

నులి పురుగులు చెట్ల వేళ్లకు ఆశిస్తే దుంప బలహీనపడి, ఆకులు నల్లగా మాడి ఎండిపోతాయి. దీని నివారణకు 200 గ్రాముల వేప పిండి, 100 గ్రాముల వీఏఎం కలిపి ఒక్కో మొక్కకు వేయాలి.

పసుపు మచ్చ తెగులు

ఆకులపై చిన్న చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి, క్రమేపి వివిధ దశల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెట్ 2.5 గ్రాములు, క్లోరోథాలోనిల్ 2 గ్రాములు ఒక్క లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నష్ట పరిహారం రాలేదు



నేను రెండు ఎకరాల్లో కర్పూరం, మరో రెండు ఎకరాల్లో బొంత (కూర) అరటి సాగు చేశాను. ఎకరానికి రూ.70 వేలకు పైబడి పెట్టుబడులు పెట్టాను. వాతావరణం అనుకూలిస్తే గిట్టుబాటు అవుతుంది. ఒకసారి వెదురు కర్ర కొనుగోలు చేస్తే మూడు పంటలకు ఉపయోగపడుతుంది. గత రబీ సీజన్‌లో తుపానుకు రెండు ఎకరాల పంట పూర్తిగా దెబ్బతింది. పంట నష్ట పరిహారం మాత్రం రాలేదు.

– జానకి శివ, రైతు, ఇ.గోకవరం, ప్రత్తిపాడు మండలం

మెళకువలతో అధిక దిగుబడి



అరటి సాగు చేసే రైతులు అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. అరటి పంటను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం ఉత్తమం. అరటి తోటలో వివిధ రకాల అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. విపత్కర పరిస్థితుల్లో పంటకు 33 శాతానికి మించి నష్టం వాటిల్లితే ప్రభుత్వం ఎకరాకు రూ.14 వేలు వంతున నష్టపరిహారాన్ని చెల్లిస్తుంది.

– కె.దివ్యశ్రీ, ఉద్యాన అధికారి, ప్రత్తిపాడు

దసరా ఉత్సవాలకు శ్రీకారం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శ్రీదేవి నవరాత్ర ఉత్సవాలకు బుధవారం పందిరి రాట వేసి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని సుబ్బారావు కాలనీలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు పసుపు కొట్టారు. వచ్చే నెల 2న విజయ దశమి కావడంతో ఈ నెల 22 నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, కుర్ర గోవిందు, మహిళలు పాల్గొన్నారు.

గోకవరంలో...

గోకవరం: స్థానిక వీరభద్రుని గద్దెలో కొలువైన కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాట వేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కృష్ణ శర్మ, కమిటీ సభ్యులు మాట్లాడుతూ విజయవాడలో మాదిరిగానే గద్దెలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అలంకరణలు చేస్తామన్నారు. ఈ నెల 22న కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయని తెలిపారు. అమ్మవారికి ప్రతిరోజూ కుంకుమ పూజలు, సరస్వతీ పూజలు, దశమి రోజున సెమీ పూజ, హోమం నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 4న అమ్మవారి ఊరేగింపు, 7న అన్నసమారాధనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.



గోకవరం వీరభద్రునిగద్దెలో పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కిర్లంపూడి కుమ్మరివీధిలో పందిరి రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఉత్సవాలకు రాట ముహూర్తం

కిర్లంపూడి: స్థానిక కుమ్మరివీధిలో దసరా ఉత్సవాలకు బుధవారం పందిరి రాట వేసి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. ఈ నెల 22 నుంచి దేవి నవరాత్రుల ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధి సిబ్బంది తీరుపై ఆగ్రహం

- కూలీలకు పనులు కల్పించడం లేదని మండిపాటు
- వాడీవేడిగా కోటనందూరు మండల సమావేశం



ఉపాధి పనుల కల్పనపై ఏపీఓ రాజ్‌గోపాల్‌ను నిలదీస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

కోటనందూరు: గ్రామాల్లో ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించడం లేదని ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనితీరును వివరిస్తుండగా ఏపీఓ రాజ్‌గోపాల్‌ను పలు గ్రామాల సర్పంచులు పనుల కల్పనపై నిలదీశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం నెల రోజులు కూడా కూలీలకు పని చెప్పలేదని మండిపడ్డారు. పనికి హాజరుకాని వాళ్లకు మస్తర్లు వేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతున్నారని, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పనులు కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులను ఏ అధికారిక కార్యక్రమాలకు పిలవకుండా అధికారులు తమను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను సరఫరా చేయాలని ఏఓ చంద్రశేఖర్‌కు సూచించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసేలా క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వ్యవసాయం, వైద్యం, విద్య, మండల మహిళా సమాఖ్య, పంచాయతీరాజ్ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. పశుసంవర్ధక శాఖ అధికారి సమావేశానికి రాకపోవడంపై ఎంపీడీఓ వెంకటనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్ మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచులు సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, గొర్లి రామచంద్రరావు, కొరుప్రోలు కృష్ణ, తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ శివాజీ పాల్గొన్నారు.

మురళీకృష్ణంరాజుకు సూర్యప్రకాష్ సంఘీభావం



మురళీకృష్ణంరాజుకు సంఘీభావం తెలుపుతున్న సూర్యప్రకాష్

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఆయన తండ్రి ముదునూరి రామరాజులకు ఆ పార్టీ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సంఘీభావం తెలిపారు. ధర్మవరంలో మురళీకృష్ణంరాజును కలిసి మద్దతు తెలిపారు. రాజకీయ కుట్రల నేపథ్యంలో 86 ఏళ్ల వయసు కలిగిన ముదునూరి రామరాజుపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన రైల్వే సీసీఎం



దక్షిణ మధ్య రైల్వే సీసీఎం ఈటా పాండేకు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (సీసీఎం) ఈటా పాండే (సికింద్రాబాద్) బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ఫొటో, ప్రసాదాలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి మల్లేశ్వరరావు

జగ్గంపేట: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో బుధవారం మండల పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలపై ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డులు సక్రమంగా అమలు కావటం లేదన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి, ఉపాధ్యక్షుడు డి.అమృతరావు, సభ్యులు డీవీవీ ప్రసాద్, పడాల వీరవెంకట సత్యనారాయణ, హెచ్‌ఆర్‌వీ జోషి, గోన చక్రరావు, ఎం.రామలింగేశ్వరరావు, టీజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వారధి పోటీలు



రౌతులపూడిలో వారధి పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సతీష్‌బాబు

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి వారధి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ–1 సతీష్‌బాబు ప్రారంభించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వక్తృత్వ పోటీల్లో రౌతులపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, వ్యాసరచన పోటీల్లో పారుపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. విజేతలు ఈ నెల 16న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అచ్చిరాజు, జ్యోతి, పాండురంగ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మోతాదుకు మించితే ముప్పు

- రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన
- గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు



జగపతినగరంలో రైతులకు నానో యూరియా అందజేస్తున్న వ్యవసాయాధికారులు



జగన్నాథపురంలో డ్రోన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శంఖవరం: ఖరీఫ్ సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడితే పంటకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. మండలంలోని మండపం, కొండగొరంపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు పురుగుల మందుల విష ప్రభావంపై అవగాహన కల్పించారు. వరి నారు మడుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వరి నారు మడులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వినియోగంపై అవగాహన

కిర్లంపూడి: రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గిపోతుందని మండల వ్యవసాయాధికారి సుధామాధురి అన్నారు. జగపతినగరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నానో ఎరువు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధామాధురి మాట్లాడుతూ రైతులు నానో ఎరువులు వాడడం వల్ల ఖర్చుతో పాటు శ్రమను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ ఉద్యోగి శ్యాంప్రసాద్, సిబ్బంది మంజూష, రమ్య, వీరమణికంఠ, రైతులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడవద్దు

కోటనందూరు: వరిలో ఎరువుల వినియోగం మోతాదుకు మించితే నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరిసాగులో యూరియాను తగిన మోతాదులో మాత్రమే వేయాలన్నారు. అవసరానికి మించి వాడితే ప్రయోజనం లేకపోగా పైరుకు తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందన్నారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. డ్రోన్‌తో నానో యూరియాను వరి పొలంలో పిచికారీ చేయడాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్

ప్రత్తిపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ ఆరోపించారు. ప్రత్తిపాడులోని లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో బుధవారం లిబరేషన్ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీహార్‌లో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ కూటమికి వ్యతిరేకంగా ఉన్న 65 లక్షల ఓట్లను భారత ఎన్నికల కమిషన్ ద్వారా తొలగించడం రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే అన్నారు. భారత దేశ వస్తువులపై ట్రంప్ సుంకాలు విధిస్తుంటే మోదీ, బీజేపీ పెద్దలు అమెరికాకు వ్యతిరేకంగా నోరు మెదపడం లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపు నిచ్చారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు

ప్రత్తిపాడు: ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం అనంతపురంలో సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ డబ్బాలు కొట్టుకోవడం సిగ్గుచేటు అని లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు విమర్శించారు. ప్రత్తిపాడులో బుధవారం ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం కొందరికే... నిరుద్యోగ భృతి లేదు.. ఏడాదికి మూడు సిలిండర్లు తుస్.. ఇలా ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేర్చకుండానే తాము సూకర్ సక్సెస్ అంటూ భుజాలు చరుచుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీలను భూముల నుంచి ఖాళీ చేయించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లా వరకూ ఉన్న సబ్‌ప్లాన్ గిరిజన గ్రామాలలను ఏజెన్సీలో కలపాలని, కాకినాడ జిల్లాలోని గిరిజన గ్రామాలకు పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలు, పాలకులకు ప్రజాఉద్యమాల ద్వారా బుద్ధి చెప్పాలని బంగార్రాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు ఉదయ్‌కిరణ్, రేచుకట్ల సింహాచలం, గొడుగు సత్యనారాయణ, కె.జనార్ధన్, మానుకొండ లచ్చబాబు, చిన్నిబిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



తునిలో చెత్త సేకరణ రిక్షాలను క్లాప్‌మిత్రలకు అందిస్తున్న చైర్‌పర్సన్ భువనసుందరి

తుని: పట్టణంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం గ్రీన్ అంబాసిడర్లకు చెత్త సేకరణ రిక్షాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు 12 కొత్తవి, మరో 12 పాత రిక్షాలకు మరమ్మత్తులు చేయించి 24 రిక్షాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరావు, డీఈ చల్లకొండ సతీష్, ఏఈ లక్ష్మీప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు



ధర్మవరంలో ఉత్సవ కమిటీకి విరాళం అందజేస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని బుధవారం ఏలేశ్వరం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక తోటవీధి, పల్లపువీధి, మండలంలోని సి.రాయవరం, లింగంపర్తితో పాటు పలుచోట్ల అన్నదానాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ధర్మవరం నంది సెంటర్‌లో వినాయకుడి మండపం వద్ద బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీకి రూ.5 వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.